క్లుప్తంగా

ఏసీపీని కలిసిన ఆర్‌కేపీ ఎస్సై



ఏసీపీ రవికుమార్‌కు మొక్క అందిస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్‌ను శనివారం రామకృష్ణాపూర్ (ఆర్‌కేపీ) పోలీస్‌స్టేషన్ ఎస్సై–2 దుర్గం లలిత కలిశారు. ఇటీవల లలిత ఎస్సైగా పదోన్నతి సాధించడంతో ఆమెను రామకృష్ణాపూర్ ఎస్సై–2గా నియమించారు. ఈ మేరకు ఏసీపీ రవికుమార్‌ను తన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 8మందికి శిక్ష

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో 8మందికి శిక్ష పడిందని ఎస్సై సంతోశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో 8 మందిని మంచిర్యాల స్పెషల్ జేఎఫ్‌సీఎం(ఎక్సైజ్) కోర్టులో హాజరుపర్చగా జడ్జీ ఉపనిషద్వాని వీరికి 2రోజుల శిక్ష విధించిందన్నారు. శిక్షలో భాగంగా వీరు రెండు రోజుల పాటు మంచిర్యాల సినిమా వాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరిసరాలను శుభ్రం చేయాలని ఆదేశాలిచ్చారని ఎస్సై తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

కాలువ నిర్మించారు..



సాక్షి ఎఫెక్ట్..

భీమారం: 'నిలిచిన నీరు... ప్రయాణికులు బేజారు' అనే శీర్షికతో ఈ నెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి నేషనల్ హైవేస్ అధికారులు స్పందించారు. మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై పోలంపల్లి సమీపంలో పంటపొలాల నుంచి వచ్చే వృథా నీరు జాతీయ రహదారి పైకి రాకుండా అధికారులు శనివారం జేసీబీతో రోడ్డు పక్కన కాలువ నిర్మించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వే ఉద్యోగులకు క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న ఉద్యోగులు

బెల్లంపల్లి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం బెల్లంపల్లిలో రైల్వే ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను బెల్లంపల్లి రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ ఏ.గోపి లాంఛనంగా ప్రారంభించారు. రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఇండోర్ క్రీడా పోటీలు, ఆరుబయట ఔట్ డోర్ క్రీడా పోటీలను ఏర్పాటు చేయగా ఉద్యోగులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. రైల్వే విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వాలీబాల్, షటిల్, క్యారమ్స్, వీల్ చైర్, టగ్గాఫ్‌వార్, మహిళ ఉద్యోగులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలిండియా రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచ్ చైర్మన్ నాగరాజు, సెక్రెటరీ సాంబశివుడు, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రెటరీ డీపీ సాల్మన్, రైల్వే సంఘ నాయకుడు తిరుపాల్ నాయక్, ఏడీఈఎన్, రైల్వే ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారుల హామీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అధికారులు హామీ ఇచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం కార్మిక సంఘాల నాయకులతో ఆర్డీవో హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ శ్వేత చర్చలు జరిపారు. గడిచిన రెండు రోజుల నుంచి శానిటేషన్ కార్మికులు విధులు బహిష్కరించగా వాటర్ సప్లై ఇంజనీరింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కార్మికులు విధులకు వెళ్లడానికి విముఖత చూపారు. దీంతో ప్రభుత్వ అధికారులు కార్మిక సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించి మాట్లాడారు. కార్మికుల పెండింగ్ పీఎఫ్ ఫండ్ డబ్బులను జమ చేస్తామని, జనరల్ ఫండ్ నుంచి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో చర్చలు ఫలప్రదమయ్యాయి. అంతకు ముందు మున్సిపల్‌కార్మికులు కార్యాలయం ముందు నిరసన తెలిపి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ చర్చల్లో కార్మిక సంఘాల నాయకులు రమణ, రంజిత్‌కుమార్, దేవదాస్(సీఐటీయూ), మున్సిపల్‌వర్కర్స్ యూనియన్ నాయకులు యాకూబ్, రాజలింగు, నీరటి రాజన్న, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



భీమిని: మానవహారంగా విద్యార్థులు



నస్పూర్: ఓటర్స్ డే ఆకృతిలో విద్యార్థులు



దండేపల్లి: నమూనా ఓటింగ్‌లో విద్యార్థులు



జైపూర్: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



కోటపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



భీమారంలో ర్యాలీ



తాండూర్: ఐబీ చౌరస్తాలో ప్రతిజ్ఞ



చెన్నూర్‌రూరల్: పొక్కూరు పాఠశాలలో ప్రతిజ్ఞ

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

- ఘనంగా ఓటరు దినోత్సవం

భీమారం/చెన్నూర్‌రూరల్/దండేపల్లి/మందమర్రి రూరల్/కాసిపేట/కోటపల్లి/జైపూర్/నెన్నెల/భీమిని/నస్పూర్/తాండూర్/చెన్నూర్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. విద్యార్థులు, ప్ర జలతో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. పలుచోట్ల విద్యార్థులకు డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి వి జేతలకు బహుమతులు అందజేశారు. ఓటు హక్కు ద్వారానే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందన్నారు. ఓటు హక్కును వినియోగించుకునే చైతన్యం ప్రజల్లో వచ్చినప్పుడే దేశం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని డిప్యూటీ కలెక్టర్, చెన్నూర్ నియోజకవర్గ ఆర్వో చంద్రకళ అన్నారు. చెన్నూర్ పాత తహసీల్ కార్యాలయం ఎదుట మానవహారం ఏ ర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. దండేపల్లి మండలం వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నమూన పోలింగ్ నిర్వహించి, విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. జైపూర్ తహసీల్దార్ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. నస్పూర్ తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులు ఓటర్స్ డే ఆకారంలో కూర్చొని ఓటర్స్ డే నిర్వహించారు.



చెన్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



100మీటర్ల జెండాతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజల చేతిలో ఓటు వజ్రాయుధం

బెల్లంపల్లి: ప్రజల చేతిలో ఓటు వజ్రాయుధమని బెల్లంపల్లి ఆర్డీవో పీ హరికృష్ణ పేర్కొన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని బెల్లంపల్లిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్ ఏరియాలోని బజారు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది 100 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన ప్రారంభించారు. ఈ ప్రదర్శన పాత బస్టాండ్ చౌరస్తా, బజారు ఏరియా, అంబేడ్కర్ చౌరస్తా, పాత జీఎం కార్యాలయం చౌరస్తా మీదుగా ఏఎంసీ క్రీడా మైదానం వరకు కొనసాగింది. ఏఎంసీ క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీవో ప్రతిజ్ఞ చేయించారు. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ప్రిన్సిపాల్ అంజయ్య ప్రతిజ్ఞ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ జ్యోత్స్న, మున్సిపల్ కమిషనర్ కే శ్రీనివాసరావు, ఎంపీడీవో మహేందర్ రావు, ఎంఈవో పోశయ్య, మాజీ ఎంఈవో మహేశ్వరరావు, పీడీలు ఎస్‌కే రాజ్‌మహ్మద్, రవి, లెక్చరర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగంతోనే సంక్షేమ ఫలాలు



వేడుకల్లో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లనే పేద ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి రాజ్యాంగ గౌరవ్ దినోత్సవ్ కార్యక్రమాన్ని బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. దేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు రాజ్యాంగ రచయిత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన జీవిత చరిత్ర, రాజ్యాంగ విలువలను వివరిస్తున్నట్లు తెలిపారు.

సంవిధాన్ గౌరవ్ అభియాన్ వేడుకలు

బెల్లంపల్లి: భారతీయ జనతా పార్టీ అనుబంధ ఎస్సీ మోర్చా నేతృత్వంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ వేడుకలను శనివారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసిపేట శివాజీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంటా చౌరస్తాలోఉన్న భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్నీ శుద్ధి చేసి నీటితో కడిగారు. పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిపై కార్మికులకు శనివారం గని మేనేజర్ లక్ష్మీనారాయణ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గని ఉత్పత్తిని పెంచడానికి, ఉద్యోగుల్లో ఉత్సాహం పెంపొందించడానికి ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గనిలో అత్యుత్తమంగా పనిచేసిన 9మంది కార్మికులను గుర్తించి, వారికి బహుమతులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, అధికారులు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్వో వాహనం అడ్డగింత

- బిల్లులు చెల్లించాలని డిమాండ్

చెన్నూర్: పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైటింగ్, వీడియో, ఫొటోలు తీసిన బిల్లులు చెల్లించాలని పాయిరాల బాపు, మసూద్ అనే వ్యక్తులు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ వాహనం ఎదుట కూర్చుని నిరసన తెలిపారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొని ఆమె తిరిగి వెళ్తుండగా అంబేడ్కర్ చౌరస్తాలో బాధితులు కారు ఎదుట బైఠాయించారు. పోలీసులు బాధితులను సముదాయించి తహసీల్దార్ కార్యాలయానికి రావాలని కోరారు. తీరా తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో మాట్లాడేందుకు నిరాకరించారు. దీంతో వారు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వాహనానికి అడ్డుగా కూర్చొని నినాదాలు చేశారు. ఆర్వో చంద్రకళ, తహసీల్దార్ మల్లికార్జున్ పక్షం రోజుల్లో బిల్లులు చెల్లిస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం బాపు, మసూద్ మాట్లాడుతూ.. వీడియోగ్రఫీ, ఫొటోలు తీసినందుకు రావాల్సిన బిల్లు రూ.13.70లక్షలు కాగా రూ.10 లక్షలు, లైటింగ్‌కు రూ.9లక్షల బిల్లు కాగా రూ.5లక్షలే ఇచ్చారని తెలిపారు. మిగతా డబ్బుల కోసం నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. పక్షం రోజుల్లో బిల్లులు చెల్లించకుంటే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.



ఆర్వో వాహనం ఎదుట కూర్చున్న బాధితుడు

జిల్లా సంచార జాతుల సంఘం నూతన కార్యవర్గం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా సంచార జాతుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు తిపిరిశెట్టి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కోనేటి శ్రీనివాస్‌లు హాజరు కాగా, జిల్లా నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి గండికోట కృష్ణ, గౌరవ అధ్యక్షులుగా తాళ్ల వేణు, జిల్లా అధ్యక్షుడు మద్దివేణి అర్జున్, ప్రధాన కార్యదర్శి జక్కుల సమ్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, కోశాధికారి పురాణం క్రాంతికుమార్, ఉపాధ్యక్షులు వైద్య భాస్కర్, చిందం సాయికుమార్, ఉపకార్యదర్శి రాథోడ్ భాస్కర్‌లను ఎన్నుకున్నారు.

భోజన్నకు ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు

కాసిపేట: మండల తహసీల్దార్ భోజన్న శనివారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకున్నాడు. 2024లో నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి నిర్వహణలో ఉత్తమంగా వ్యవహరించినందుకు బెస్ట్ తహసీల్దార్ అండ్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా అవార్డు అందించినట్లు తెలిపారు.

ఎస్సీ హాస్టల్‌లో దుప్పట్లు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ కళాశాల బాలుర వసతిగృహంలో శనివారం ఎస్సీ సంక్షేమ అభివృద్ధిశాఖ అధికారి రవీందర్ దుప్పట్లు పంపిణీ చేశారు. వసతిగృహంలో అందిస్తున్న భోజనంపై ఆరా తీశారు. ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు.

'ఓటరు హక్కులు–యువతపాత్ర'పై వర్క్‌షాప్

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో 'ఓటరు హక్కులు–యువత పాత్ర' అనే అంశంపై కార్యశాల(వర్క్‌షాప్) నిర్వహించారు. రిసోర్సుపర్సన్ కనకలక్ష్మి విద్యార్థులకు ఓటు యొక్క విలువ, యువత పాత్ర, ఎన్నికల సంఘం విధులు వివిధ అంశాలపై నిశితంగా వివరించారు.

చిల్డ్రన్స్ పార్కు నిర్మాణానికి భూమిపూజ

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డు తిలక్‌నగర్‌లో రూ.6లక్షలతో చేపట్టనున్న చిల్డ్రన్స్ పార్కు నిర్మాణానికి శనివారం వార్డు కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్ శంకుస్థాపన చేశారు. వారంరోజుల్లో పార్కు పనులు పూర్తిచేయనున్నట్లు తెలిపారు.

నియామకం

కాసిపేట: మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడిగా అట్టెపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

సులభ్ కాంప్లెక్స్ కూల్చొద్దు

మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్‌కాలనీ వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో గల సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చొద్దని సింగరేణి సులభ్ వర్కర్స్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. సులభ్ కాంప్లెక్స్‌ను కూల్చడానికి వచ్చిన రైల్వే డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన జేసీబీని శనివారం అడ్డుకున్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

రామకృష్ణాపూర్: రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడు రాజయ్య, అధ్యక్షుడు నడిగోట తిరుపతి అన్నారు. బీజోన్ ఏరియాలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రజకుల కోసం దోబీఘాట్‌లు నిర్మించాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

బెల్లంపల్లిరూరల్: గ్రామాల అభివృద్దే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి అన్నారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామంలోని చింతలగూడెంలో శనివారం రూ.5 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు.

సామగ్రి అందజేత

భీమిని: మండలంలోని వీగాం ఉన్నత పాఠశాలలో సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రవాస భారతీయుడు జూపల్లి శ్రీని రూ.లక్ష 20వేల విలువ చేసే సామగ్రి పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. బ్యాగులు, క్రీడా సామగ్రి, వాటర్ బాటిళ్లు, సౌండ్‌సిస్టమ్ అందించారు. ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి, భీమినీ, నెన్నెల ఎంఈవోలు ఉన్నారు.

పాలకవర్గాలకు 'వీడ్కోలు'



చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పాలకవర్గ పదవీ కాలం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ నర్సరీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కౌన్సిల్ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఐదేళ్లలో తమ హయాంలో జరిగిన అభివృద్ధి పనులతో పాటు అనుభవాలను కౌన్సిల్ సభ్యులు పంచుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ గద్దె రాజు, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ స్వామి, డీఈ సుమతి, ఏఈ అచ్యుత్, టీపీఎస్ రాజ్ కుమార్, రెవెన్యూ అధికారి సతీష్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల పదవీకాలం ముగుస్తున్నందునా మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బేడబుడగ జంగాలను ఎస్సీ డీలో చేర్చాలి

జన్నారం: బేడబుడగ జంగాలను ఎస్సీ డీ కేటగిరీలో చేర్చాలని బేడబుడగ జంగాల నిర్మల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. మండలంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు బేడబుడగ జంగాలు అనుకూలం అన్నారు. వర్గీకరణ జరిగితే తమను డి గ్రూప్‌లో చేర్చి తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ సుల్తాన్ అహ్మద్ జ్ఞాపకార్థం శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అతడి కుమారుడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇస్మాయిల్ అహ్మద్ జుల్ఫికర్ ప్రారంభించారు. 18జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి.

అలరించిన విద్యార్థుల ఆటాపాట

మంచిర్యాలఅర్బన్: స్థానిక మిమ్స్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం 2024–25 కల్చరల్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు (ఆటపాట)ఎంతోగానో అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, ప్రెసిడెంట్ ఉపేందర్‌రెడ్డి, డైరెక్టర్లు శ్రీధరావు, విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన 118మంది విద్యార్థులు క్యాట్ ఒలింపియాడ్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. గణిత విభాగంలో 55మంది విద్యార్థులు, ఫిజిక్స్ విభాగంలో 27మంది, కెమిస్ట్రీ విభాగంలో 36మంది ప్రతిభ చూపారు. ఇందులో అక్షిత అనే విద్యార్థినికి రూ.2వేలు నగదు, 25మందికి రూ.2వేలు నగదు బహుమతులు, 92మంది విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు పొందారని ప్రిన్సిపాల్ జోబిన్ తెలిపారు.

పర్యటించి.. తెలుసుకుని

- కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఎఫ్‌సీఆర్‌ఐ విద్యార్థుల స్టడీ టూర్
- అటవీ అభివృద్ధి.. వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

జన్నారం: ములుగు ఫారెస్ట్ కళాశాల రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్‌ఐ)కు చెందిన బీఎస్సీ ఫారెస్ట్రీ ద్వితీయ సంవత్సరానికి చెందిన 54మంది విద్యార్థులు కవ్వాల్ టైగర్‌జోన్‌లో నిర్వహించిన క్షేత్రస్థాయి పర్యటన శనివారంతో ముగిసింది. మూడు రోజులుగా జన్నారం అటవీ డివిజన్ లోని జన్నారం, తాళ్లపేట్, ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లలో పర్యటించారు. డివిజన్‌లో వన్యప్రాణుల కోసం చేపడుతున్న అభివృద్ధి పనులు, గడ్డి మైదానాలు, నీటి సౌకర్యం, ఆవాసాల్లో అలజడి లేకుండా చూడటం, స్మగ్లింగ్ నిరోధం లాంటివి అధికారుల ద్వారా నేర్చుకున్నారు. శనివారం ఇందన్‌పల్లి రేంజ్‌లోని ఘనిషెట్టికుంట, మైసమ్మ కుంట ప్రాంతాల్లో బర్డ్ వాక్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శాలిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్షేత్రస్థాయి పర్యటన ముగింపు సందర్భంగా విద్యార్థులను పలుకరించిన 'సాక్షి'తో వారి అభిప్రాయాలు పంచుకున్నారు.



ఇందన్‌పల్లి రేంజ్‌లో ఫారెస్ట్రీ విద్యార్థులు

చాలా విషయాలు నేర్చుకున్నాను



అడవులు చాలా దట్టంగా ఉన్నాయి. అధికారులు చేపడుతున్న అభివృద్ధి పనులు, స్మగ్లింగ్ నిరోధం, అడవుల రక్షణ తదితర అంశాలతో పాటుగా వన్యప్రాణుల కోసం చేపడుతున్న సౌకర్యాలు తెలుసుకున్నాం. అధికారుల సహకారంతో చాలా విషయాలను నేర్చుకున్నాను. ఈ విషయాలు చాలా తోడ్పాడుతాయి

– హర్షిత, విద్యార్థిని

నేరుగా వన్యప్రాణులను చూశాం



జన్నారం అటవీ డివిజన్‌లోని జన్నారం, ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌లలో పర్యటించినప్పుడు నేరుగా వన్యప్రాణులను చూశాం. చాలా బాగా అనిపించింది. గడ్డి క్షేత్రాలు, నీటి కుంటలు బాగున్నాయి. అభివృద్ధి పనుల వివరాలను స్మగ్లింగ్ నిరోధం, కేసులు చేసే పద్ధతిని తెలుసుకున్నాను.

– సాయి రోషన్ సింగ్, విద్యార్థి

వోల్వో ఆపరేటర్ల సమ్మెకు మద్దతు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఓబీ పనులు నిర్వహించే జేవీఆర్ కంపెనీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వోల్వో ఆపరేటర్ల సమ్మెకు మద్దతిస్తున్నట్లు హెచ్‌ఎమ్మెస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం వోల్వో ఆపరేటర్లు సమ్మె చేస్తున్నా, కంపెనీ యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. వారికి పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలన్నారు. బోనస్ చట్టం ప్రకారం అర్హులకు బోనస్ చెల్లించాలన్నారు. ఇతర డిమాండ్లు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

రామకృష్ణాపూర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, ఇందులో ఎవరూ నిరుత్సాహ పడకూడదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన వాగ్దానాలన్నింటినీ ప్రభుత్వం నెరవేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతీ నిరుపేదకు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నీలం శ్రీనివాస్‌గౌడ్, వొడ్నాల శ్రీనివాస్, గోపతిరాజయ్య,మహంకాళి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ప్రారంభం

చెన్నూర్: చెన్నూర్ జమా మసీదు వెనుక గల సయ్యద్ షా బాబా రహమ్మతుల్లా అలై దర్గా వద్ద ఉర్సు ప్రారంభమైంది. శనివారం దర్గా నుంచి ఐబీ దర్గా వరకు చందాల్ (చదార్) శోభ యాత్రను నిర్వహించారు. అశ్వాలు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.